అన్నివిధాలా
అతనికి నచ్చిన
అమ్మాయిని
ఆఖరిక్షణంలో
తిరస్కరించడానికి
కారణం?

ఎస్.
వివేకానంద
కథ

# పాపం గోపాలం!

గోపాలం పెళ్ళి చూపులకొచ్చాడు!

పెళ్ళి కూతురు సిగ్గుతో తలవంచుకుని కూర్చోలేదు. గోపాలం ముఖంలోకి గుచ్చి గుచ్చి చూస్తోంది.

అమ్మాయిని చూడగానే ముగ్ధుడయ్యాడు గోపాలం. తాను ఊహించినట్టే ఆమె బంగారు ఛాయలో మెరిసిపోతోంది. పొడవైన వాలుజడ... నుదుటిమీద గాలికి వాలిపడుతున్న ముంగురులు... సొగసైన కళ్ళు... ముద్దొచ్చే పెదాలు... శరీర నిర్మాణంలో పొందికవున్న అవయవ సౌష్టవం... అచ్చంగా ఇలాంటి అమ్మాయినే తాను పెళ్ళాడాలని ఎన్నో ఏళ్ళుగా కలలు కంటున్నాడు.

"మా అమ్మాయి మాధవి బి.ఎ పాసైంది" తండ్రి చేతులు పిసుక్కుంటూ చెప్పాడు వినయంగా.


"ఉద్యోగం కూడా చేస్తోందా?—" గోపాలం తండ్రి రాఘవరావు అడిగాడు.

"అవునండి. ప్రైవేట్ కంపెనీలో..." పిల్ల తండ్రి సదాశివరావు నసిగేడు.

"ఎందులో అయితేనేం?... జీతం ఏ మాత్రం వస్తోందీ...??" అమ్మాయిని తేరిపార చూస్తూ మరో ప్రశ్న విసిరేడు రాఘవరావు.

"అంతా కలసి రెండు వేలదాకా వస్తుంది..." జవాబిచ్చాడు సదాశివరావు.

"చూడమ్మా... అన్నట్టు నీ పేరు మాధవి కదూ... నువ్వు ఉద్యోగం చేస్తున్న కంపెనీ రూల్సు ప్రకారం నీకు ఎల్ టిసి, లీవ్ ఎన్‌కాష్‌మెంట్ వగైరా వగైరా వంటి ప్రివలేజీలు అన్నీ వున్నాయా...?"



"ఉన్నాయండీ..." ముక్తసరిగా తలాడిస్తూ జవాబిచ్చింది మాధవి.

తం(డి మాటలకి అడ్డు రావటం ఇష్టంలేని గోపాలం మౌనం వహించాడు.

మాధవిని వివిధ భంగిమల్లో... అన్ని కోణాల్లోంచి చూస్తూ ఆమె అందాన్ని ఆస్వాదిస్తూ ముగ్ధుడవుతున్నాడు.

రాఘవరావు డబ్బు ఆశ మనిషి! తనకు

బోలెడంత ఆస్తి... ఆదాయం వున్నా... కొడుకుతోబాటు రాబోయే కోడలుకూడా ఉద్యోగం చేసి ఆర్జించాలనే కోరిక వున్న వ్యక్తి!

పెళ్ళిచూపుల తంతు పూర్తి అవగానే మాధవిని ఇంట్లోకి తీసుకెళ్ళింది తల్లి.

గోపాలానికి కూడా అక్కడే ఎక్కువసేపు కూర్చోవటానికి బోరన్పించింది.

తండ్రి చెవిలో ఊది తాను ఫ్రెండ్‌ని కలిసి వస్తానని చెప్పి టౌన్లోకి బయల్దేరాడు.

ఇక అక్కడ మిగిలిందల్లా ఉభయ పక్షాల పెద్దలు మాత్రమే—

''రాఘవరావు గారూ! మా అమ్మాయి మీకూ పిల్లవాడికి వచ్చినట్టేనా...?—'' మెల్లగా విషయం ప్రస్తావించాడు సదాశివరావు.

''మీ అమ్మాయి మా అబ్బాయికినచ్చినట్టేనని ఇప్పుడు నాతో అన్నాడు.''

''చాలా సంతోషం! మరి మిగతా విషయాలు కూడా మనం మాట్లాడుకుని ఒక నిర్ణయానికొస్తే త్వరలో నిశ్చితార్థం ఏర్పాటుచేసుకోవచ్చు. ఏమంటారు?—'' సగం సంతోషంతో అన్నాడు సదాశివరావు.

''మీకు తెలియనిదేముంది? మీ ఆలోచనేమిటో చెప్పండి ముందు. తర్వాత నా అభిప్రాయం క్షణాల్లో చెప్తాను...''

''పెళ్ళి ఘనంగా మీ స్థాయికి తగ్గట్టుగా చేస్తాను''

''అది సరే... అమ్మాయి వంటిన బంగారం ఏ మాత్రం వుందేమిటి?...'' నొసలు ఎగరేస్తూ ప్రశ్నించాడు రాఘురావు.

''దొంగల భయంవల్ల బంగారు వస్తువులే మీ అమ్మాయికి ఇంతవరకూ చేయించలేదు. పైగా... నాకు నలుగురూ ఆడపిల్లలే— మాధవి నా జ్యేష్ఠ పుత్రిక...'' నీళ్ళు నమిలాడు సదాశివరావు.

''చూడండి!— మాకు ఒక్కగానొక్క పిల్లవాడు. ఎం.ఏ చదివించాను. ప్రస్తుతం బ్యాంకులో ఆఫీసరు చేస్తున్నాడు'' ఇంకా ఏదో చెప్పబోయినవాడల్లా ఆగాడు.

''నిజమే! మీ అబ్బాయి బుద్ధిమంతుడు... తెలివైనవాడూ అనికూడా తెల్సు...''

''అంతేకాదండీ... మీ అబ్బాయి నెలకు నాలుగువేలు సంపాదిస్తున్నాడు!... మీ పిల్ల మా ఇంటి కోడలైతే ఆడబడుచుల బాధ అసలే వుండదు!...'' గోపాలం తల్లి మాట్లాడింది.

''ఇక అత్తగారి విషయానికొస్తే... మా ఆవిడకి అసలు నోట్లో నాలుకే లేదు...'' భార్యను సమర్థించి మాట్లాడేడు రాఘవరావు.

''అందుకే గదుటండీ... మీ వంటివారితో వియ్యమందాలని కోరుకుంటోంది...'' సమయస్ఫూర్తితో అన్నాడు సదాశివరావు.

''ఇకపోతే... మా అబ్బాయి వివాహం హైదరాబాద్‌లోనే జరగాలని మా అభిప్రాయం! ఎందుకంటారేమో... మా బంధువర్గం... బలగం అంతా అక్కడే ఉన్నారు. మరో ఊళ్ళో పెళ్ళి జరిగితే రైలు ఛార్జీలకని... బస్సు చార్జీలకని బోలెడు ఖర్చు అవుతుంది గనక మా వాళ్ళు పెళ్ళికిరాకపోవచ్చు! అదీ విషయం''. చెప్పదల్చుకున్న విషయాన్ని నిక్కచ్చిగా చెప్పేసి భర్త ముఖంలోకి చూచింది తులశమ్మ.

"లాంఛనాలు... అప్పగింత బట్టలు గురించి మేము ప్రత్యేకించి చెప్పేందుకేముంది? ఆ విషయాలన్నీ మీకుతెల్సినవే! అది సరే... ముందుగా అన్నీ మేమే మాట్లాడేస్తున్నాం... మరి... మీ మనసులో మాటేమిటో బొత్తిగా బైటపెట్టటంలేదు..." రాఘవరావు అన్నాడు.

"ఆడపిల్లల తండ్రిని కనుక ఈ సమయంలో నేను ఏం మాట్లాడినా అధికంగానే వుంటుంది— మీరు చెప్పినవన్నీ విన్నాను... కానీ... అసలు విషయం గురించి మనం ముచ్చటించుకోనే లేదు..." నసిగాడు సదాశివరావు.


"మీ మాటల్లోని గూడార్థం నాకు బోధపడిందిలెండి!... కట్నం గురించేగా మీ ఆలోచన..." అదోలా నవ్వేడు రాఘవరావు.

"లక్షదాకా ఇస్తామంటూ బోలెడు సంబంధాలు కాళ్ళదగ్గరకొచ్చినా పిల్లనచ్చకో... జాతకం కుదరకో వద్దనుకున్నాం!— ఇప్పుడు మీ అమ్మాయి మాకు నచ్చింది గనుక... మీరిచ్చే లక్షకు వప్పేసుకుందాం అని వుంది.. ." తులశమ్మ ముసి ముసిగా నవ్వింది.

"అబ్బో... మీరు అంతటి భారాన్ని నా మీద పెడితే నేను మోయ్యగలనా?... మరో ముగ్గురి ఆడపిల్లల పెళ్ళిళ్ళు చెయ్యాలి కదా...?"

"అది మీకో లెఖటండీ— ఊళ్ళో పేరుమోసిన క్రిమినల్ లాయర్ మీరు. 30 ఏళ్ళుగా ప్రాక్టీసు చేస్తూ డబ్బుతో పాటు పేరు ప్రఖ్యాతులుకూడా సంపాదించారు— మీ వంటి వారు బీద పలుకులు పలుకుతూంటే ఆశ్చర్యంగా వుంది నాకు..." కుండబద్దలు కొట్టినట్టు మాట్లాడాడు రాఘవరావు.

"అవుననుకోండి!... కానీ నేను లాయరునైవుండి కట్నంపేర మీకు అంత డబ్బు ఇవ్వటం భావ్యంకాదు. పైగా చట్టం వప్పుకోదు— కాకపోతే ఆడపిల్లల తండ్రిగా కన్నకూతుళ్ళను అత్తారింటికి పంపాల్సిన బాధ్యత



నామీదుంది. అందుకు తలవంచాల్సి వస్తోంది'' అన్నాడు సదాశివరావు.

''మీరన్నదీ నిజమే! కట్నమనే ముద్దు పేరు వదిలేసి ఆ మొత్తాన్ని కూడా 'లాంఛనం' క్రింద జమకట్టేయండి!—'' రాఘవరావు చమత్కరించాడు.

''మీరు నాకు మరో అవకాశమివ్వండి!— మీరడిగిన దాంట్లో సగం ఇవ్వటానికి ప్రయత్నిస్తాను. మీరు కొంచెం ఓ మెట్టు క్రిందికి దాగితే బావుంటుంది... కదూ?!—''

సధాశివరావు మాటలు రాఘవరావుని ఇరకాటంలో పెట్టేసినయ్!— ససేమిరా కట్నంలో పైసా కూడా తగ్గించనని మొండికెత్తితే?... అమ్మో!... ఆయనగారు అసలే పేరుమోసిన లాయరు. వరకట్నం నేరం క్రింద తనను లాక్కెళ్ళి లాకప్‌లో తోసెయ్యగలడు— పోనీ... ఈ సంబంధం వదులుకుందామా అంటే... ఇంత చక్కటి సాంప్రదాయం... మాధవిలాంటి అందమైన పిల్ల... చదువుకుని వుద్యోగం చేస్తున్న అమ్మాయి తమకు కోడలుగా లభించకపోవచ్చు!

అంతేకాదు!— ఇప్పటికి షుమారు పాతిక సంబంధాలు ఏదోరకంగా బెడిసికొడుతూ వచ్చాయి— కారణాలు ఏవైనా ఏవొక్కటీ తమకు నచ్చలేదు. కుదర్లేదు. ఇప్పుడు ఇదీ కాదంటే ఇక గోపాలానికి పెళ్ళే కాదన్పించింది రాఘవరావుకి!

తెగేవరకు లాగటం సబబుకాదు— ఇప్పుడీ సంబంధాన్నికాదంటే... గోపాలం పరిస్థితి పూర్తిగా చెయ్యి దాటిపోతుంది. ఇప్పటికే ఎన్నోరకాలుగా బతిమిలాడి ఈ పిల్లని చూడటానికి బయల్దేరతియ్యగలిగాడు. చిన్నవాడా చితకవాడా?— ముప్పయ్యేళ్ళు నిండబోతున్నాయ్! ఇక తన మాటవినకపోవచ్చు. ఏ కులం తక్కువదాన్నో... గుణంలేని అమ్మాయినో ప్రేమించానంటూ ఇంట్లోకి తెస్తే?... అప్పుడు తన పరువేంగాను?—

తనకా డబ్బు లోటు లేదు! లక్షలు మూలుగుతున్నాయ్!!— ఇదంతా ఏనాటికైనా గోపాలానికేగదా!?— మరి అలాంటప్పుడు కట్నంకోసం కక్కుర్తిపడి కళ్ళముందున్న బంగారంలాంటి సంబంధాన్ని కాలదన్నుకోవటం అవివేకమే అవుతుంది.

ఆలోచించి ఆలోచించి ఓ నిర్ణయానికొచ్చాడు.

''రాఘవరావుగారేదో దీర్ఘాలోచనలో వున్నారు...''

సదాశివరావు పలకరింపుతో వులిక్కిపడ్డ రాఘవరావు ''మా అబ్బాయి గోపాలం ఇంకా రాలేదేమాని...'' మాట మార్చేధోరణిలో అన్నాడు.

''ముందు పెద్దవాళ్ళం మనం ఒక నిర్ణయానికొద్దాం!— ఈలోగా అబ్బాయి కూడా రానేవస్తాడు— మరి... నేను చెప్పిన మాట మీకు సమ్మతమేనా?...''

''డబ్బుదేముందండీ! ఇవాళ సంపాదిస్తాం... రేపు ఖర్చుపెడతాం! మాట శాశ్వతం మనకు!! — అమ్మాయి నచ్చింది. అంతకంటే ముందు మీ పద్ధతి సాంప్రదాయం నచ్చింది— సరే కానివ్వండి!'' అన్నాడు రాఘవరావు.

సదాశివరావు వదనంలో పుట్టెడు ఆనందం వుట్టిపడ్డది!—

''అయితే ఇంకేం?!— సిద్ధాంతిగారు

కూడా ఇక్కడే వున్నారు గనక నిశ్చయతాంబూలాలు తేదీని కూడా నిర్ణయించేసుకుందాం!— ఏమంటారు?—''

తన సమ్మతిని తెలియచేస్తూ తల ఆడించాడు రాఘవరావు.

ఇంతలో మరోసారి వేడివేడి కాఫీరావటంతో నవోత్సాహంతో అందరూ సేవించారు

''మొత్తానికి బేరం చౌకలోనే కొట్టేశారు...'' చమత్కారంగా అన్నాడు రాఘవరావు.

''అంతా మీ మంచితనం!...''

''కాదండీ బాబూ!... పిల్లకు పిల్లవాడికీ రాసి పెట్టివుందీ! అంతే!!—''

''అందుకే అంటారు... మేరేజస్ ఆర్ మేడిన్ హెవెన్ అని...''

అంతానవ్వుకున్నారు.

సరిగ్గా అప్పుడే గోపాలం రివ్వున ఇంట్లో కొచ్చాడు. మనిషికోపంతో ధుమధుమలాడిపోతున్నాడు.

కొడుకు ఎందుకలా సీరియస్‌గావున్నాడో అర్థంకాలేదు రాఘవరావుకు.

అందరూ గోపాలంకేసి విస్తుపోయి చూశారు.

''ఒరే గోపాలం! ఇంత ఆలస్యమైందే?— పోన్లే... మొత్తానికి నువ్వు అదృష్టవంతుడివి! — ఈ సంబంధమే ఖాయం చేశాను...'' కొడుకు భుజం తడుతూ అన్నాడు రాఘవరావు.

''నాన్నగారూ!... లేవండి వెళ్ళిపోదాం...'' కర్ఛీఫ్‌తో ముఖం తుడుచుకుంటూ తొందరచేశాడు గోపాలం.

''ఏమైందిరా?... ఆ కంగారేమిటి?...''

''నాకీ పెళ్ళి ఇష్టంలేదు...''

అంతా నివ్వెరపోయారు. ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. అసలేం జరిగిందో.... రెండు గంటల క్రితం ఈ సంబంధాన్నే ఖాయం చెయ్యండి అని తండ్రి చెవిలోవూది... ఇప్పుడిలా ఎందుకు గోపాల



## వీణ!

పరమయ్యతో ఆశ్చర్యంగా అన్నాడు చలమయ్య ''మీ అమ్మాయి వీణ వాయించడం చూస్తుంటే సాక్షాత్తూ ఆ మహాలక్ష్మి దిగివచ్చినట్టుంది''.

''అదేమిటి... లక్ష్మీదేవికి వీణ వాయించటం తెలీదు కదా!''

''అందుకే గదండీ అలా అన్నాను''

''.....!?''

—పద్మశ్రీ (మాణిక్యారం)

ం మండిపడుతూ అయిష్టత ప్రకటిస్తున్నా డో ఎవ్వరికీ బోధపడ్లేదు.

"అసలేం జరిగింది గోపాలంగారూ?—' బతిమిలాడే ధోరణిలో అడిగేడు సదాశివ రావు.

"మీరు మర్యాదస్తులనుకున్నాం! మీ సంబంధాన్ని ఖాయంచేసుకుందామని వుత్సా హపడ్డాం... కానీ ... కానీ..."

"ఆవేశపడకు గోపాలం! అసలు విషయ మేమిటో నాకైనా చెప్పు?..." పక్కకు తీసుకెళ్ళి విషయం రాబట్టాలనే వుద్దేశ్యంలో మాట్లాడేడు రాఘవరావు.

"మనమిక్కడ ఒక్క క్షణం కూడా వుండద్దు. వెళ్దాంపదండి..." రివ్వున వీధిలో కి నడిచాడు గోపాలం.

అర్థాంతరంగా కొడుకుని అనుసరించక తప్పలేదు తల్లీ తండ్రీ!

మిగతావారంతా శిలా ప్రతిమల్లాగవుండి పోయారు.

* * *

గోపాలం బుర్రలో వేడి ఇంకా చల్లారలే దు. పక్కనేవున్న రాఘవరావు మతిపోయిన ట్టనిపిస్తోంది.

బస్సు పరుగుపెడుతూనేవుంది!

"ఇలాంటి వాళ్ళని తెలీక అనవసరంగా ఇంతదూరం వచ్చాం..." ముఖం పక్కకు తిప్పకుండా తన్లో తాను గొణిగేడు.

"ఒరే గోపాలం!... ఇప్పుడైనా విషయ మేమిటో చెప్పరా?... ఎందుకు బంగారం లాంటి సంబంధాన్ని వద్దనుకున్నావ్?—" తరచి తరచి అడిగేడు రాఘవరావు.

కిటికీలోంచి చల్లనిగాలి వీస్తోంది. గోపాల ం వుంగరాల జుట్టు గాలికి రెపరెపలాడుతూ ముఖాన పడుతోంది.

స్నేహితుడ్ని కలిసి వద్దామని పెండ్లి చూపుల తంతు అయ్యాక రోడ్డు మీద కొచ్చాడు గోపాలం.

రిక్షా ఎక్కిన గోపాలం మొత్తానికి ఎట్లాగైతేనేం ఫ్రెండ్ ఇంటినెంబరు వెతు క్కొని ఇంటి తలుపుతట్టాడు.

"నువ్వా గోపాలం?!— వాట్— ఎ—సర్ ప్రైజ్?... కమాన్‌కమాన్..." గదిలోకి ఆహ్వానించాడు రాజా.

రాజా, గోపాలం కల్సి అయిదేళ్ళు చదువుకున్నారు. ఆఫీసరు పోస్ట్‌కి ఒకేసారి వ్రాతపరీక్ష వ్రాశారు! ఇంటర్వ్యూకి వెళ్ళా రు సెలక్టయ్యారు.

కొన్నాళ్ళు ఇద్దరూ కలిసి ఒకేచోట పనిచేశారు. ఆ తర్వాత ట్రాన్స్‌ఫరు కావట ంతో రాజా వెళ్ళిపోయారు.

"నువ్వు రూములో వుంటావో వుండ వోని అనుకుంటూ వచ్చాను మొత్తానికి కల్సుకోగలిగాను." కూర్చుంటూ అన్నాడు గోపాలం.

"ఏమిటిలా వూడిపడ్డావ్? నువ్వొస్తున్న ట్టు లెటరైనా వ్రాశావు కావేం?—"

"అనుకోకుండా బయల్దేరాం..."

"బహువచనం ప్రయోగించావ్... నీవె ంట ఎవరైనా వచ్చారా?—"

"మా పేరంట్స్ కూడా వచ్చారు..."

"మరి... వాళ్ళేరీ?..."

"మేం వచ్చిన పనైపోయింది. మళ్ళీ రాత్రికే వెళ్ళిపోతున్నాం! ఈలోగా నిన్నొక సారి చూచిపోదామన్పించింది. నే రిక్షాలో

వచ్చేశాను..."

"వెరీగుడ్! అవునూ... నువ్వింకా పెళ్ళి చేసుకోలేదా?—"

"నీకు చెప్పకుండావా... మరి నీ సంగతే మిటీ? ఎన్నాళ్ళిట్లా హోటలు భోజనం మఠం నిద్ర??—"

"పెద్దవాళ్ళు చూపించే సంబంధాలు నాకు నచ్చటంలేదు... ఏం చేయను...?—"

"ఇంకేం!?— ఓ అందగత్తెను చూచి ప్రేమించెయ్... దట్సాల్!!—"

"ప్రస్తుతం ఆపన్లోనేవున్నాను— నువ్వు మేగజైన్సు చూస్తుండు— నేనీలోగా స్నానంచేసి బట్టలు మార్చుకొస్తాను— ఇద్దరం అట్లా రోడ్డుమీదికెళ్ళి మాట్లాడుకుందాం..." చివాలున లేచి బాత్‌రూమ్‌వేపు నడిచాడు రాజా!

మేగజేన్ తిరగేస్తున్న గోపాలం దృష్టి పక్కను మళ్ళింది. ఆ గదిలో ఓ మూలగవున్న టీపాయ్ మీద ఫోటో ప్రేమ్‌లో మాధవి ఫోటో కన్పించింది.

కంగారుపడ్డాడు గోపాలం! దగ్గరగా వెళ్ళి మరోసారి ఫోటోలో అమ్మాయిని తదేకంగా చూశాడు.

అవును!— కొద్దిసేపుటి క్రితం ఆ అమ్మాయినే తాను చూచి మెచ్చుకుంది. ఆ అమ్మాయినే పెళ్ళి చేసుకునేటందుకు అంగీకరించింది.

మరి... ఆ అమ్మాయి ఫోటో రాజాగదిలో వుండటం ఏమిటి?— అంటే... రాజా ప్రేమించానని చెప్పిన అమ్మాయి మాధవేనా?!... నో!— అలా జరగటానికి వీల్లేదు.

గోపాలంలో కోపం... ద్వేషం క్షణంలో రగులుకుంది. వళ్ళంతా తేళ్ళు జర్రులు పాకుతున్నట్టన్పించింది!— ఎంతమోసం?— కాదుగదా?—

ఒక్క క్షణం కూడా ఫ్రెండు గదిలో కూర్చోవాలన్పించలేదు. శరీరంలో రక్తం వుడికిపోతున్నట్టన్పించింది. తన మీద తనకే అసహ్యంవేసింది.



# బేటీ

'బేటా' సిన్మా సూపర్ హిట్టయి ఇంకా బంపర్ కలెక్షన్స్‌తో నడుస్తూనే వుంది. అందులో— అనిల్‌కపూర్ కన్నా మాధురీదీక్షిత్‌దే పవర్‌ఫుల్ రోల్ గనుక— ఆ చిత్రం చూసినవాళ్ళంతా— బేటా కంటే 'బేటీ' అనే టైటిల్ బాగా సూట్ అయివుండేది. అంటూంటే— అది విని అనీల్‌కపూర్ బావురుమంటున్నాడట.

—నిఖిల్

రాజాని ప్రేమించి... తనను పెళ్ళాడాలనుకుందా మాధవి?— ఎంత వంచన?!—

ఛీ! ఈ ఆడవాళ్ళని నమ్మకూడదు... మాధవిని గొంతు పిసికి చంపేయాలన్పించింది ఆ క్షణంలో.

ఒక్క వుదుటున గదిలోంచి బైటపడ్డాడు గోపాలం. ఆవేశంలో వూగిపోతూ రిక్షా ఎక్కేడు.

"ఏమిట్రా అబ్బాయ్ నీ ఆలోచన?— నేను అడిగే ప్రశ్నలకి జవాబు చెప్పవేం?—"


తండ్రి మాటకి గోపాలం ఆలోచనలు గతంలోంచి ప్రస్తుతంలోకొచ్చినయ్.

"ఆ అమ్మాయి మా ఫ్రెండు రాజాని ప్రేమించిందినాన్నా... అందుకే ఈ సంబంధం వద్దన్నాను..." తండ్రివేపు తలతిప్పి కోపాన్ని ఆవేశాన్ని అణచుకుంటూ చెప్పాడు.

రాఘవరావు తలతిరిగినట్టయింది. నోటి మాటకరువైంది.

స్పీడుగా బస్సు పరుగుపెడుతూ దూసుకుపోతోంది.

*




డిజైన్: ఆర్.తారాబాలకృష్ణ (హైదరాబాద్)